ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు
జిల్లా వార్తలు

5

బుధవారం 22 మే 2024





ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బాలాజీ లత్కర్ ఎస్పీ మల్లికా గార్గ్

పకడ్బందీగా.. కౌంటింగ్

● జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బాలాజీ లత్కర్

నరసరావుపేట, మే 21: ఓట్ల లెక్కింపుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బాలాజీ లత్కర్ మంగళవారం తెలిపారు. ఎస్పీ మల్లికా గార్గ్‌తో కలిసి కాకాని వద్ద ఉన్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సిబ్బందికి అలసత్వం తగదన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలన్నారు. కౌంటింగ్ రోజు జేఎన్టీయూ ప్రహరీ చుట్టూ 100 మీటర్ల వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, 100 మీటర్ల లోపలికి ఏ వాహనాన్ని అనుమతించకూడదని తెలిపారు. ప్రధాన ద్వారం వద్ద పోలింగ్ ఏజెంట్లను అభ్యర్థులను కౌంటింగ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీచేసి కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ముందుగానే కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, కౌంటింగ్ రోజున నిర్వహించాల్సిన విధి విధానాల గురించి అవగాహన కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూములను అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలో తెరిచే విధంగా చర్య తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ముందస్తుగానే బ్రీఫింగ్ చేయాలని ప్రతి నియోజకవర్గ కౌంటింగ్‌లో సంబంధిత రిటర్నింగ్ అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు : ఎస్పీ

ఓట్ల లెక్కింపు అనంతరం జరిగే పరిణామాల మీద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మల్లికా గార్గ్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అనుమానితులను బైండోవర్ చేయడం జరుగుతున్నదన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జూన్ ఆరో తేదీ వరకు ఇటువంటి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం కానీ బాణసంచా కాల్చడం నిషేధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచర్ల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, రిటర్నింగ్ అధికారులు రమణకాంత్ రెడ్డి, సి.సరోజ, ఈవీఎం నోడల్ అధికారి అజయ్ కుమార్ పాల్గొన్నారు.



మాచర్లలో పోలీసు కవాతులో ఎస్పీ మల్లికా గార్గ్

ఏ స్థాయి వారినైనా.. ఉపేక్షించం

● లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే తీవ్ర చర్యలు ● నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు ● జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్

మాచర్ల టౌన్, మే 21: లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే ఏ స్థాయి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ మల్లిక గార్గ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయం, టౌన్ పోలీస్‌స్టేషన్‌లను ఆమె పరిశీలించారు. డీఎస్పీ, ఏఎస్పీ, సీఐలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 146 కేసులు ఉండగా, 1500 మంది నిందితులను గుర్తించామన్నారు. వీరిలో 958 మందిపై చర్యలు తీసుకున్నామన్నారు. మిగతా వారిని గుర్తిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు 1000 మందిపై బైండోవర్ చేశామన్నారు. పోలింగ్, తదుపరి రోజు జరిగిన ఘర్షణలో బైండోవర్ అయిన వారిలో 50 శాతం మంది ఉన్నారన్నారు. బైండోవర్‌లో ఉండి గొడవలకు దిగిన వారి వద్ద నుంచి పూచీకత్తుపై డబ్బులు వసూలు చేస్తామన్నారు. డబ్బులు కట్టకపోతే అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు. పెట్రోలు బంకులకు కూడా నోటీసులు అందించామన్నారు. బాటిళ్లలో, క్యాన్లలో పెట్రోలు అమ్మవద్దని సూచించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బంకులను సీజ్ చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నారు. కాగా గురజాల సబ్ డివిజన్ పరిధిలో 59 కేసులు నమోదు కాగా 658 మందిని గుర్తించామన్నారు. వీరిలో 50 మందిని రిమాండ్‌కు పంపామన్నారు. మాచర్ల పరిధిలో కిందిస్థాయి ఉద్యోగులు ముఖ్యమైన సమాచారాన్ని బయటకు పంపించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు డిపార్ట్‌మెంట్ రూల్స్‌ను అనుసరించి నడుచుకోవాలని, అతిక్రమించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. అనంతరం పట్టణంలో ఎస్పీ మల్లిక గార్గ్ ఆధ్వర్యాన ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించారు. కాగా ఎస్పీ రాక సందర్భంగా పోలీసులు మధ్యాహ్నం నుంచే షాపులు మూసివేయించారు.

ముమ్మరంగా.. తనిఖీలు

సత్తెనపల్లి, దుర్గి, మాచర్లటౌన్, మే 21: సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీలో కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా పట్టణ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. ప్రతి గృహాన్ని తనిఖీ చేసి పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు తొలగించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదల అయ్యే వరకు అపరచిత వ్యక్తులు పర్యటించినా కవ్వింపు చర్యలకు, కక్ష సాధింపు చర్యలకు దిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో ఎస్ఐలు సంధ్యారాణి, సత్యనారాయణ, ఏఎస్ఐ సుబ్బారావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఓబులేశునిపల్లెలో పోలీసుల సోదాలు

ఓబులేశునిపల్లెలో..

దుర్గి మండలం ఓబులేశునిపల్లెలో మంగళవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ కోటయ్య నేతృత్వంలో 40 మంది పోలీసు బలగాలు గృహాలు, శిథిలావస్థకు చేరిన నివాసాలు, గడ్డివాములు పరిశీలించారు. రికార్డులేని 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

మాచర్ల పట్టణంలో...

పట్టణంలో సీఐ బ్రహ్మయ్య ఆధ్వర్యాన 50 మంది పోలీసులు కోడెల శివప్రసాదరావు కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇల్లు సోదా చేశారు. ఎటువంటి మారణాయుధాలు లభించలేదు. ఈ కార్డెన్ సెర్చ్‌లో ఎస్ఐ అరుణ తదితరులు పాల్గొన్నారు.



జానపాడులో పోలీసులు స్వాధీనం చేసుకున్న 25 ద్విచక్ర వాహనాలు

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.7

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....


గుంటూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. గుంటూరు ఈస్ట్				
2. గుంటూరు వెస్ట్				
3. తాడికొండ				
4. ప్రత్తిపాడు				
5. మంగళగిరి				
6. తెనాలి				
7. పొన్నూరు				
8. బాపట్ల				
9. రేపల్లె				
10. వేమూరు				
11. మాచర్ల				
12. గురజాల				
13. వినుకొండ				
14. చిలకలూరిపేట				
15. నరసరావుపేట				
16. పెదకూరపాడు				
17. సత్తెనపల్లి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : శివశంకరీ దేవాలయం దగ్గర, వెంగళాయపాలెం, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా

ఎన్‌జీ రంగా వర్సిటీలో కోర్సులు



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ దూరవిద్య విభాగం- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు (రెండు నెలలు). గ్రామీణ రైతులు, మహిళలు, యువత దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై నుంచి సెప్టెంబరు వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.

కోర్సులు: మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకం.

అర్హత: వయోపరిమితి నిబంధనలు లేవు. తెలుగు చదవడం, రాయడం తెలిసి ఉం డాలి. కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి.

శిక్షణ: రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి పాఠ్య ప్రణాళిక పుస్తకం ఇస్తారు. వారానికి ఒక రోజు చొప్పున మొత్తం ఏడు ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. ఒక్కో తరగతి సమయం 2 గంటలు. ఇందులో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు నిర్వహిస్తారు. వీటికి అభ్యర్థుల అటెండెన్స్ తప్పనిసరి. అభ్యర్థి ఎంపిక చేసుకొన్న స్టడీ సెంటర్లో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు పూర్తయిన తరవాత పరీక్ష ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **చిరునామా:** డీన్(వ్యవసాయం) కార్యాలయం, పరిపాలన భవనం, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు- 522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి
DIKSUCHI

సీబీఐపీలో పీజీ డిప్లొమా

హరియాణాలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ)- 'పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ విత్ ఆటోమేషన్ స్కాడా/డీఎంఎస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి 26 వారాలు. ఇది జాబ్ ఓరియంటెడ్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్. ఇందులో 75 శాతం థియరీ, 25 శాతం ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. స్పాన్సర్డ్, నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.cbip.org

SCHOLARSHIP ALERT

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion

Last Date to Apply: 01-10-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1



NextGen Edu Scholarship

Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/EYGDS1

UK-India TOEFL Scholarship

Description: UK-India TOEFL Scholarship 2024 is a program that supports Indian students pursuing full-time UG/PG studies in the UK. This opportunity is offered by the Educational Testing Service (ETS), in collaboration with the National Indian Students and Alumni Union (NISAU).

Eligibility: Open to Indian citizens applying to undergraduate or postgraduate courses at UK universities. Applicants must have taken the TOEFL iBT test between April 1 and July 15, 2024, with a minimum score of 75.

Prizes & Rewards: A one-time scholarship of 2,50,000 each for 10 students

Last Date to Apply: 15-07-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/TOEF1

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Wn7hfeQలో చదవండి.



కేన్స్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. దాంతో ప్రమోషన్ వర్క్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లిన కన్నప్ప టీమ్ అక్కడ సందడి చేసింది. నిర్మాత మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. అక్కడ 'కన్నప్ప' టీజర్‌ను అందరికీ ప్రదర్శించారు. ఈ టీజర్ చూసి అక్కడి ప్రేక్షకులు ముగ్ధులయ్యారని విష్ణు తెలిపారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూటర్స్, కేన్స్ ఫెస్టివల్‌కు వచ్చిన ఇండియన్స్ టీజర్ బాగుందని అభినందించారు. ఆ రెస్పాన్స్ చూసిన తర్వాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.' అని ఆయన తెలిపారు. జూన్ 13న ఇండియా వైడ్‌గా 'కన్నప్ప' టీజర్ విడుదల చేస్తారు. దానికంటే ముందు ఈ నెల 30న తెలుగులో కన్నప్ప టీజర్‌ను రిలీజ్ చేస్తామని విష్ణు వెల్లడించారు. 'మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంతమంది సెలెక్టెడ్ ఆడియన్స్‌కు ఈ టీజర్ చూపిస్తాం' అని అన్నారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు.


కొత్త తేదీన హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరోం హర'. మరోసారి ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెలాఖరున ఈ చిత్రం విడుదలవ్వాలి. అయితే మంగళవారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూన్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో వెనుక అగ్ని జ్వాలలు చెలరేగుతుండగా, భుజంపై తుపాకీతో నడిచొస్తున్న సుధీర్‌బాబు లుక్ శక్తిమంతంగా ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలక పాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. సంగీతం: చైతన్ భరద్వాజ్. సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్.

ఖురేషి అబ్రమ్.. అదిరే లుక్!

మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'కు సీక్వెల్ వస్తోంది. 'ఎల్ 2 ఎంపురాన్' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఖురేషి అబ్రమ్ పాత్రను పోషిస్తున్నారు. స్టీఫెన్ నడుంపల్లి ఖురేషీ అబ్రమ్‌గా ఎలా మారాడనే విషయాన్ని సీక్వెల్‌లో చూపించబోతున్నారు. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఆ పాత్ర లుక్ విడుదల చేశారు. స్టయిలిష్‌గా నడుచుకుంటూ వస్తున్న మోహన్‌లాల్ లుక్ అదిరిపోయిందని అంటున్నారు. నటుడు, ఈ చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్ 'హ్యాపీ బర్త్ డే లాలెట్టా' అంటూ సోషల్ మీడియా వేదికగా మోహన్‌లాల్‌కు



అభినందనలు తెలిపారు. మరో విషయం ఏమిటంటే లైకా ప్రొడక్షన్స్ సంస్థ 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రంతో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతోంది. లడఖ్, చెన్నై, కొట్టాయం, అమెరికా, లండన్ ప్రాంతాల్లో 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం షూటింగ్ జరిగింది. ప్రస్తుతం తిరువనంతపురంలో చిత్రీకరణ జరుగుతోంది. ఆ తర్వాత గుజరాత్, దుబాయ్‌లో కూడా షూటింగ్ చేయాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది భారీ లెవల్‌లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు సుభాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్ చెప్పారు.

పారితోషికం రూ.250 కోట్లా?



బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగి, పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిన ప్రియాంక నటనకు గుడ్‌బై చెప్పకుండా హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌లు చేస్తూ బిజీగానే ఉన్నారు. అమెజాన్ ప్రైమ్ కోసం ఆమె గత ఏడాది 'సెటడెల్' సిరీస్‌లో నటించారు. దీనికి ఇండియన్ వెర్షన్‌లో ప్రియాంక పాత్రను సమంత చేశారు. 'సిటాడెల్'లో నటించినందుకు ప్రియాంక తీసుకున్న పారితోషికం ఎంతో తెలుసా? దాదాపు రూ. 250 కోట్లు. బాప్‌రే.. అనుకోకండి. ఇది నిజమే. ఇటీవల వచ్చిన సంజయ్ లీలా భన్సాలి 'హీరామండీ' కోసం నెట్‌ఫ్లిక్స్ చెల్లించిన మొత్తం కంటే ప్రియాంక తీసుకున్న పారితోషికమే ఎక్కువట. అంటే ఇప్పుడు ఓటీటీలో హయ్యెస్ట్ పెయిడ్ ఆర్టిస్ట్ ప్రియాంక నే అన్నమాట. ఆమె పనే బాగుంది కదూ!

డర్టీఫెలోకు ఛాయిస్ లేదు



శాంతి చంద్ర, దీపిక సింగ్, సిమ్రిత్, నికిష రంగ్‌వాలా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి. శాంతిబాబు నిర్మించారు. ఈ నెల 24న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'డర్టీఫెలో' అనే టైటిల్ ఎందుకు పెట్టారు అని శాంతిచంద్రను అడిగాను. 'ఈ కథకు ఆ టైటిల్ తప్ప మరో ఛాయిస్ లేద'ని ఆయన చెప్పారు. మంచి కథతో వస్తున్న చిత్రమిది' అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'ఎప్పటికైనా హీరో కావాలనుకున్నాను. అది 'మంత్ర' చిత్రంతో నెరవేరింది. ఆ తర్వాత బిజినెస్ పనులతో గ్యాప్ వచ్చింది. మళ్లీ 'డర్టీఫెలో' కథ నచ్చడంతో నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాను. ఎమోషన్, యాక్షన్, రొమాన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అన్నారు. అడారి మూర్తి సాయి మాట్లాడుతూ 'సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న సినిమాలను బతికించండి. చిత్రబృందం అంతా ఒకే కుటుంబంలా కలసి పనిచేశాం. కథా బలమున్న చిత్రమిది' అన్నారు.



జూన్‌లో 'ఓ.సి' వినోదం

హరీశ్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా తెరకెక్కిన చిత్రం 'ఓ.సి'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌కు హరీశ్‌బొంపెల్లి దర్శకుడు. బీవీఎస్ నిర్మాత. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. జూన్ 7న 'ఓసి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ 'ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన కొందరు యువకుల జీవితాలు ఎలాంటి మలుపు తిరిగాయనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఆసక్తి కరంగా ఉంటుంది. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు 'ఓ.సి' అనే టైటిల్ పెట్టడానికి ఉన్న కారణం సినిమా చూస్తే తెలుస్తుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి వంశీ ఎస్., అక్షర్ బ్యాండ్ సంగీతం అందించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/y8pE852 లో చదవండి.

గవర్నర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ, కలెక్టర్

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పర్యటనకు వెళుతూ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్‌లో తొలుత ఆయనకు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందజేశారు. గవర్నర్ శబరి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు జిల్లాకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు గవర్నర్ నివాసం నుంచి రైల్వేస్టేషన్ వరకు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర భవిష్యత్‌కు బంగారు బాట అమరావతి

- 1617వ రోజుకు రైతుల ఆందోళనలు




బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 21: రాజధాని అమరావతి నిర్మాణం అడ్డుకున్న వారు అధికారంలోకి రావటం కలే అవుతుందని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1617వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. మూడు ముక్కలాటతో ఏమైనా ప్రయోజనం ఉందా.. అనేది ప్రజలకు సీఎం జగన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. అదే అమరావతితో ఎంత ప్రయోజనం రాష్ట్రానికి ఉందో చెపుతామని సవాల్ విసిరారు. లక్షల కోట్ల రాష్ట్ర ప్రజల సంపద అమరావతిని హస్తగతం చేసుకోవాలని సీఎం జగన్‌రెడ్డి చూశాడన్నారు. అది కుదరక పోవటంతో విశాఖలో వేల కోట్ల భూములు కారు చౌకగా కొనుగోలు చేసి అక్కడ రాజధాని అంటున్నాడని దీనిని ప్రజలు అర్థం చేసుకునే ఈ ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపటానికి ఓటు వేశారన్నారు. వైసీపీ వారు విశాఖలో జరిపిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ గురించి నిగ్గు తేలాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాల వారి భవిష్యత్‌కు బంగారు బాట అమరావతి అని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

ప్రభుత్వంపై పందెమా.. నై నై

- వైసీపీ తరఫున కాసేందుకు పందెం రాయుళ్ల వెనుకంజ
- రూపాయికి రూపాయిన్నర ఇస్తామన్నా వెనకడుగు
- రూపాయికి రూపాయి పందాలు నిల్
- ఫలితాలకు ముందే వైసీపీ నేతలు డల్

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు జరగక ముందే వైసీపీ నేతలు డీలా పడిపోయారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఓటరు నాడి అర్థం కాక పోలింగ్ ప్రక్రియ ముగిసిన దగ్గరి నుంచి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వచ్చేవరకు ఇరు పార్టీలు పోటీలు పడి పందేలు వేసుకునేవారు. సహజంగా రూపాయికి రూపాయి అంటే సమాన రీతిలో బెట్టింగ్‌లు ఉండేవి. ఒక పార్టీ వారు కోటి రూపాయలు కాస్తే ప్రత్యర్థి పార్టీ వారు పోటీ కలపాలి. ఇప్పుడు అటువంటి బెట్టింగ్‌లు మచ్చుకు కూడా జరగటం లేదు. గత ఐదేళ్ళుగా రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రి జగన్ హయాంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అప్రతిష్టపాలు అయింది. పాడు పెట్టటం, కూల్చటం, కొట్టటం, కేసులు పెట్టి జైళ్ళలో పెట్టించటం తప్పితే ఏమాత్రం రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో వైఎస్ఆర్ హయాంలో కూడా లేని విధంగా కక్షలు కార్పణ్యాలతో రాష్ట్రం రగిలిపోయింది. ముఖ్యంగా ఉద్యోగ వర్గాలు కూడా సకాలంలో జీతాలు అందక అష్టకష్టాలు పడ్డారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికల్లో పోలింగ్ రోజునే ఎన్నికలు ఏకపక్షంగా జరిగినట్లు కనిపించింది. ముఖ్యంగా ఉద్యోగులు కసితీరా ఓట్లు వేయటంతో పోలింగ్ శాతం కూడా ఎన్నడూ లేని విధంగా పెరిగింది. దేశం నలు మూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు కదిలి రావటం ఆశ్చర్యకరం. దీంతో పోలింగ్ రోజే డీలా పడిపోయిన వైసీపీ నేతలు పందేలు వేసేందుకు వెనుకాడుతున్నారు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని బెట్టింగ్ వేసేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారు. రూపాయికి రూపాయి పందేలు దొరక్కపోవటంతో టీడీపీ తరుపున పందెం వేసే వాళ్ళు తాము రూపాయికి, రూపాయన్నర ఇస్తామని ముందుకు వచ్చినా వైసీపీ తరపున బెట్టింగ్ వేసే పందెం రాయుళ్ళు తటపటాయిస్తున్నారు. బెట్టింగ్‌లకు కేంద్రమైన గుంటూరులోని ఓ ప్రముఖ క్లబ్‌లో గతంలో కోట్లలో పందేలు నడిచేవి. ఇప్పుడు వైసీపీ తరపున పందెం వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో అక్కడ కొలువు తీరే పందెం రాయుళ్ళు నిరుత్సాహ పడుతున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏ ఒక్క నియోజకవర్గంపై కూడా బెట్టింగ్‌లకు ఎవరూ ముందుకు రావటం లేదు. గతంలో పలానా నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు లేదా రెండు, మూడు నియోజకవర్గాల్లో ఒకటి రెండైనా పలానా పార్టీకి వస్తుందని పందేలు ఉండేవి. ఇప్పుడు పోలింగ్ ప్రక్రియ ముగిసిన రెండు, మూడు రోజుల్లోపు ఉమ్మడి జిల్లాలోని రెండు, మూడు నియోజకవర్గాల్లో వైసీపీ గెలుస్తుందని కొందరు బెట్టింగ్ పెట్టేందుకు ముందుకు వచ్చినప్పటికి తదనంతరం లెక్కలు వేసుకొని వాటిపై కూడా పందెం వేసేందుకు వెనుకంజ వేశారు. ఇదిలా ఉండగా పల్నాడు జిల్లాలో ఓ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున బరిలోకి దిగిన ఓ అభ్యర్థి తను గెలుస్తానని తన తరుపున ఎవరూ పందెం వేయకపోవటంతో మాటలు కోటలు దాటించే ఆ అభ్యర్థి ఏకంగా తానే పందెం బరిలోకి దిగి రూ.50 లక్షలు పందెం వేసినట్లు సమాచారం. అది కూడా రూపాయికి రూపాయి కాదు ఇతను రూపాయి కలపగా ఆ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుస్తాడని అతనిపై పందెం వేసిన వ్యక్తి రూపాయన్నర అంటే రూ.75 లక్షలు కలిపినట్లు ప్రచారం జరుగుతుంది. మైకుల ముందుకు వచ్చి తమ పార్టీ 150 సీట్లకు పైగా గెలుస్తుందని చెప్పే నాయకులు సైతం పందెం మాట ఎత్తితే పెదవి విప్పటం లేదు.



ఇసుక తవ్వకాలపై నిబంధనలు పాటించాల్సిందే

- పల్నాడు జిల్లా కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీ
- మల్లాది, కోనూరు ఇసుక రీచ్‌ల పరిశీలన



మల్లాది ఇసుక రీచ్‌లో కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీతో ఇతర అధికారులు

అమరావతి, మే 21: జిల్లాలో ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ సూచనలు తప్పక పాటించాలని మైనింగ్, ఎస్ఈబీ, రెవిన్యూ అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం పెదకూరపాడు నియోజకవర్గం మల్లాది, కోనూరు ఇసుక రీచ్‌లను సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ ఆదేశాలను అన్ని జిల్లాలకు ప్రభుత్వం జారీ చేయడం జరిగిందని తెలిపారు. అందుకు అనుగుణంగా జిల్లాలో ఉన్న రీచ్‌లలో ఇసుక క్వారీయింగ్‌కు అనుమతి లేదని అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలు సీజ్‌చేసి కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమ క్వారీయింగ్‌కు సంబంధించి ప్రజలు సమాచారం ఇచ్చేందుకు గ్రామాల్లో అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లతో ఐదు డిసిల్టేషన్ పాయింట్‌లు ఉన్నాయని. ఇసుక తవ్వకాలకు సంబంధించి ప్రస్తుతం జీసీకేసీ అనే ఏజన్సీకి ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. తవ్వకాలు జరుపుకునేందుకు వారికి పూర్తిగా అనుమతి రాలేదన్నారు. వారిపేరున అనుమతులు వచ్చిన తరువాత మాన్యువల్‌గా ఇసుక క్వారీయింగ్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. ఎక్కడా కూడా మిషనరీ వాడకూడదని ఎన్‌జీటీ గైడ్‌లైన్స్‌లో ఉందని అన్నారు. డిసిల్టేషన్ పాయింట్‌లలో ఇసుక త్రవ్వకాలు చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదని. వారు ప్రభుత్వానికి నగదు చెల్లించిన తరువాత సీఎఫ్ఓ, సీఎఫ్‌కు (కన్సెంట్ ఫర్ ఆపరేషన్స్, కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతితో చేసుకోవచ్చు అన్నారు. దానికోసం ఈ రోజు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం పెట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. దీని వలన ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంటుందని కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ అన్నారు. అనంతరం కోనూరు రీచ్ పరిశీలనకు వెళ్లారు. కలెక్టర్ వెంట మైనింగ్ ఏడి నాగిణి, ఆర్డీఓ మురళీకృష్ణ, తహశీల్దార్ వెంకటరమణారావు, ఎంపీడీవో రాణి, పొల్యూషన్, సెబ్, ఇరిగేషన్, ఎస్ఈబీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన డబ్బు ఏం చేశారు?

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, మే 21: రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఈహెచ్ఎస్‌కు ఇవ్వాల్సిన డబ్బులన్నీ ఏం చేశారంటూ జగన్ ప్రభుత్వానికి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. బకాయిల కోసం ఆస్పత్రుల యాజమాన్యాలు ఏళ్ళ తరబడి మొత్తుకుంటున్నా పట్టించు కోకుండా ఏం చేస్తున్నారని నిలదీశారు. దాదాపు రూ.1500 కోట్లు వరకు రావాల్సిన బిల్లుల కోసం ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులు సేవలు నిలిపివేతకు నిర్ణయించిన నేపథ్యంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వైసీపీ ప్రభుత్వ తీరును ప్రత్తిపాటి దుయ్యబట్టారు. ఐదు సంవత్సరాలుగా ఆస్పత్రులు కోరుతున్న సేవల రుసుములు పెంచకపోగా వందల కోట్ల రూపాయల బకాయిలు పెడితే వారు మాత్రం ఎలా మనుగడ సాగిస్తారో చెప్పాలన్నారు. పేదలకు మాత్రం ఆరోగ్యశ్రీ పరిమితి పెంచాం, సేవల పరిధిని విస్తరించాం అని గొప్పగా చెప్పుకొనే ప్రభుత్వం సేవలు అందించే ఆస్పత్రులకు బిల్లులు ఇవ్వకపోతే ఏం లాభమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత కాంట్రాక్టర్లకు కమిషన్‌ల కోసం వేల కోట్ల రూపాయలు బిల్లులు చెల్లిస్తున్న జగన్ పేదల ఆరోగ్యానికి కాపు కాచే ఆరోగ్యశ్రీ విషయంలో మాత్రం ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. ప్రభుత్వం తక్షణం బిల్లులు చెల్లించని పక్షంలో ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల సేవలు నిలిచి పోయి ఏ ఒక్క ప్రాణానికి ఇబ్బంది వచ్చినా జగన్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ప్రత్తిపాటి అన్నారు.

మాచర్ల ఎమ్మెల్యేని తక్షణం అరెస్టు చేయాలి

- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారు నాయక్

గుంటూరు, మే 21: ఈనెల 13న రెంటచింతల మండలం పాల్వాయి గేటు గ్రామం పోలింగ్ కేంద్రం (202)లో అధికారుల ముందే ఈవీఎంలు పగలకొట్టిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణా రెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ డిమాండ్ చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, పారదర్శకంగా జరుగుతున్న ఎన్నికలను, భంగం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపైనా, అతనికి సహకరించిన అనుచరులపైనా తగిన చర్యలు తీసుకుని, పాల్వాయి గేటులో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెంటచింతల మండలం రెంటాల గ్రామంలో, వెల్దుర్తి మండలం కల్లకుంట గ్రామం, కొత్త పుల్లారెడ్డిగూడెం గ్రామం, ఇదే విధంగా దౌర్జన్యాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికలు సజావుగా జరగకుండా అడ్డుకున్నారన్నారు. ఈ గ్రామాల్లో తిరిగి రీపోలింగ్ నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.

అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- మృతుడి బంధువుల నిరసన



నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

పొన్నూరుటౌన్, మే21: ఇటీవల పొన్నూరు పట్టణంలో చోటు చేసుకున్న సచివాలయ ఉద్యోగి అనుమానస్పద మృతిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని మంగళవారం మృతుడి బంధువులు నిరసనకు దిగారు. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో మృతుడి బంధువులు న్యాయం కోసం నిరసన చేపట్టారు. కొలిపర్ర మండలం, సిరిపురం గ్రామానికి చెందిన తులుమిల్లి కిషోర్ బాబు నిడుబ్రోలులోని సచివాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కిషోర్ బాబుకు చంద్రకళ అనే మహిళా పోలీస్‌తో వివాహం జరిగింది. ఇరువురు మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవటమే కాకుండా ఘర్షణలు సైతం జరిగాయి. ఇటీవల ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసిన క్రమంలో అర్బన్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత రోజు కిషోర్‌బాబు నిడుబ్రోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో శవమై తేలాడు. ఈ సంఘటనలో కిషోర్‌బాబు బంధువులు కిషోర్‌ది ఆత్మహత్య కాదని, చంపి చెరువులో పడవేశారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చి విచారణ చేపట్టి న్యాయం చేయాలని నిరసనకు దిగారు. శవ పరీక్షల నివేదిక అనంతరం కేసు సెక్షన్లను మార్చి విచారణ జరుపుతామని, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వటంతో కిషోర్‌బాబు బంధువులు నిరసన విరమించారు.

వయస్సు 26.. చోరీలు 30..

- జల్సాలకు అలవాటుపడి బైక్ దొంగతనాలు
- నిందితుడి అరెస్టు.. రూ.2.50 లక్షలు విలువైన బైక్ స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న మట్వాడ పోలీసులు

వరంగల్, మే 21: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు వరంగల్‌లోని మట్వాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపీ మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా సంగడిగుంటకు చెందిన చాగంటి పవన్ తిరుమలేశ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 26ఏళ్ల తిరుమలేష్ జల్సాలకు అలవాటుపడి తొమ్మిదేళ్లుగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 30 కొత్త మోటార్ సైకిళ్లను దొంగిలించాడు. ఎవరైనా కొత్తబైక్ కొంటే వారితో మాటలు కలిపి ఒకసారి ట్రయల్ చేసి చూస్తానని నమ్మించి బైక్‌కు పరారవుతున్నాడు. ఇప్పటికే పలుమార్లు జైలుకు వెళ్లాడు. మే 9న ములుగురోడ్ ప్రాంతంలో హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన కామెర అరవింద్ తన యమహా బైక్ సర్వీసింగ్ కోసం రావడంతో నిందితుడు తిరుమలేష్ అతడిని పరిచయం చేసుకొని ఇలాగే నమ్మించి బైక్‌తో పరార్ అయ్యాడు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి, బైక్ స్వాధీనం పర్చుకొని జ్యుడీషియల్ రిమాండ్ పంపినట్లు తెలిపారు. కేసు చేదనలో ప్రతిభకనబర్చిన క్రైం కానిస్టేబుళ్లు అలీ, తిరుపతిలను సీఐ అభినందించారు.

నాటికల పోటీలు ప్రారంభం



ఇంద్రప్రస్థం నాటికలోని సన్నివేశం

పెదనందిపాడు, మే, 21: మండలంలోని వరగాని అంకమ్మగుడి ఆవరణలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రోటరీ మాజీ గవర్నర్ వడ్లమాని రాజ్యలక్ష్మీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళలను, కళాకారులను గత ఎనిమిదేళ్ళుగా ప్రోత్సహిస్తున్న కళాపరిషత్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. మొదటి రోజు తొలి నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక చూపరులను కంటతడి పెట్టించింది. ద్వితీయ నాటిక శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి కౌసల్యా సుప్రజారామా, తృతీయ నాటికగా తెలుగు కళాసమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలుగా మానంపురి సత్యనారాయణ, ముసుగు నాగభూషణం, అనంత ఉదయరాజులు వ్యవహరించారు. అనంతరం అక్షయ పాఠశాల విద్యార్థులు భరత నాట్యం ప్రదర్శించారు. మాజీ రోటరీ గవర్నర్ వడ్లమాని రవిని దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవాధ్యక్షులు ముద్దన రాఘవయ్య, అధ్యక్ష కార్యదర్శులు పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, కమిటీ సభ్యులు బండారు రాంబాబు, రోటరీ అధ్యక్షులు వై కోదండరామిరెడ్డి, సభ్యులు కొల్లా సాంబశివరావు, వై రమణయ్య, కొర్రపాటి రామారావు, చెన్నుపాటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆ ఓట్లపై.. ఉత్కంఠ

- పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఈసారైన సక్రమంగా జరిగిందా..!
- గత ఎన్నికల్లో 50 శాతం పైగా చెల్లలేదు
- ఈ దఫా ఫెసిలిటేషన్ సెంటర్లలో సిబ్బంది ఓర్పుగా సలహాలు
- ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ప్రక్రియలన్ని సక్రమంగానే చేయించారు
- ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠ

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్దఎత్తున జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. గత ఎన్నికల్లో ఉద్యోగులు వేసిన ఓట్లలో 50 శాతం పైగా చెల్లుబాటు కాలేదు. క్లరికల్ తప్పులు కారణంగా కౌంటింగ్ సమయంలో వాటిని పక్కన పెట్టేశారు. ఈ సారి ఎలాంటి తప్పులు దొర్లకుండా నిబంధనల మేరకు ఓటింగ్ చేశారా, లేదా అనేది జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా తేలిపోనుంది. ఈ దఫా ఫెసిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగులు ఎంతో ఓర్పుగా కూర్చుని ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కారణంగా ఎక్కువ శాతం ఓట్లు తప్పక చెల్లుబాటు అవుతాయన్న ధీమా ప్రతీ ఒక్కరిలో నెలకొని ఉన్నది.

ఎన్నికల సంఘం తొలిసారిగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌లో 2,292మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఇది కూడా పోస్టల్ బ్యాలెట్ విధానంలోనే జరిగింది. 85 ఏళ్ల వయస్సు దాటిన వారు, దివ్యాంగులు ఈ విధానంలో తొలిసారిగా ఓటు వేశారు. ఈ నేపథ్యంలో వీటిల్లో కొన్ని చెల్లుబాటు కాకుండా పోయే అవకాశం లేకపోలేదు. మరోవైపు జిల్లాలో పోలింగ్ సిబ్బంది 14287, పోలీసులు 1905, అత్యవసర సర్వీసుల్లో ఉన్న వారు 874, ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ ఇక్కడ ఓటు హక్కు ఉన్న 5092, ఇతర ఎన్నికల విధుల్లో ఉన్న వారు 2300 కలిపి మొత్తం 24462 పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకొన్నారు. వారిలో 20397 మంది ఓటు వేశారు. తాడికొండలో 1655, మంగళగిరిలో 2460, పొన్నూరులో 1928, తెనాలిలో 1882, ప్రత్తిపాడులో 1609, గుంటూరు పశ్చిమలో 4156, గుంటూరు తూర్పులో 2480, ఇతర జిల్లాల్లో ఉన్న వారు 4227 మంది ఓటు హక్కుని వినియోగించుకొన్నారు.

ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఒక పార్టీ వైపు మొగ్గు చూపితే ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు అంతగా ప్రాధాన్యం ఉండదు. ఎప్పుడైతే ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు రెండు పార్టీల మధ్యన పోటా పోటీగా జరుగుతుందో అప్పుడు పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు ప్రాధాన్యం పెరుగుతుంది. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎక్కువ శాతం మంది ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లపై వైసీపీ నేతలకు కూడా ఆశలు లేవు. ఈ నేపథ్యంలో ఈవీఎం కౌంటింగ్‌లో పోటాపోటీగా జరిగితే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తప్పక టీడీపీకే లబ్ధిని చేకూర్చి పెడతాయి. కాగా ఈ దఫా ఫెసిలిటేషన్ సెంటర్లలో ప్రభుత్వ ఉద్యోగులు ఓటర్లకు అందుబాటులో ఉండి ఎన్నికల సంఘం ప్రక్రియలను విడమరిచి వివరించారు. ఓటర్లంతా దాదాపుగా వారు చెప్పిన నిబంధనలు పాటిస్తూ ఓటింగ్ చేశారు. దీని దృష్ట్యా అరకొర మినహా అన్ని ఓట్లు చెల్లుబాటు అయ్యే అవకాశం ఉందన్న ధీమాని ఉద్యోగులు వ్యక్తపరుస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

పల్నాడు వార్తలు

అనుమతులు వచ్చాకే ఇసుక తవ్వకాలు

● పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్



కోనూరులో ఇసుకరీచ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లత్కర్

అచ్చంపేట, మే 21: సుప్రీంకోర్టు ఆదేశాలు, గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి ఇసుక తవ్వకాలు జరుగుతాయని పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని కోనూరు ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇసుక పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయని, రెవెన్యూ, పోలీసుశాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలు ప్రత్యేక నిఘా ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పెద్ద పెద్ద యంత్ర సామగ్రితో ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు గుర్తించినట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనల మేరకు అనుమతులు వచ్చిన పిదప ఇసుక రీచ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మ్యాన్‌వల్‌గా కూడా ఇసుక తవ్వకాలు సాగించవచ్చునని తెలిపారు. ఆయనతో పాటు రెవెన్యూ డివిజన్ అధికారి మురళీకృష్ణ, భూగర్భ గనుల శాఖ అధికారి నాగిని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ సుధ, మండల తహసీల్దార్ ప్రవీణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుర్గి, మే 21: మండలపరిధిలోని కోలగుట్ల సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు డీఈఈ రామయ్య తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికల విధుల ధ్రువపత్రాలివ్వాలి

● యూటీఎఫ్, ఎస్‌టీయూ నేతల డిమాండ్

రెంటచింతల, మే 21: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన టీచర్లు, ఉద్యోగులకు ఎలక్షన్ డ్యూటీ ధ్రువపత్రాలను వెంటనే అందచేయాలని యూటీఎఫ్, ఎస్‌టీయూ సంఘల నేతలు డిమండ్ చేశారు. పీవోలు, ఏపీవోలు ఈనెల 14 వరకు విధుల్లో ఉన్నారన్నారు. డ్యూటీ ధ్రువపత్రాలను పీడీఎఫ్ రూపంలోనైనా పంపించాలని వారు కోరారు.

గురజాల డీఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం

గురజాలటౌన్, మే 21: గురజాల డీఎస్పీగా సీహెచ్ శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కాకినాడ ఏసీబీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన పల్లపురాజును సస్పెండ్ చేసిన విషయం విదితమే. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. శ్రీనివాసరావు గతంలో రెంటచింతల ఎస్‌ఐగా, గురజాల సీఐగా పనిచేశారు.

కమ్యూనిటీ వైద్యశాలలో ఓపీ చాలా బాగుంది

● డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీ రంగారావు



వైద్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీ రంగారావు

మాచర్ల రూరల్, మే 21: మాచర్ల కమ్యూనిటి వైద్యశాలలో ఓపీ చాలా బాగుందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీ రంగారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కమ్యూనిటి వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున మాచర్ల కమ్యూనిటీ వైద్యశాలలో రోగులకు వైద్యసేవలు ఎలా కొనసాగుతున్నాయో పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతానికి ఓపీ 360 వచ్చిందని, సాయంత్రానికి 500 దాటొచ్చని తెలిపారు. ఆరోగ్యశ్రీలో మాచర్ల కమ్యూనిటీ హాస్పిటల్ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. జనరల్ సర్జన్లు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ కేసులు తగ్గుతున్నాయన్నారు. ఫిజీషియన్‌ను విజయపురిసౌత్ నుంచి రప్పించామన్నారు. సాధారణంగా జిల్లాస్థాయి ఆసుపత్రుల్లో క్రిటికల్ కేర్ కేసులు నమోదు చేస్తామని, అయితే మాచర్ల ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ కేసులు రిజిష్టర్ అయ్యాయని అన్నారు. ఈఎన్‌టీ, గైనకాలజిస్టులు అందుబాటులో ఉన్నారన్నారు. 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు ఆర్డర్లు వచ్చాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో హైపర్‌టెన్షన్-టీ, క్యాన్సర్ ప్రోగ్రాంలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ఆస్పత్రిలో 30 ఏళ్లు నిండిన వారికి బీపీ పరీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే క్యాన్సర్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి తగిన చికిత్సనందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గర్భసంచి క్యాన్సర్‌కు సంబంధించి మాచర్ల ఆస్పత్రిలోనే చికిత్స అందుతుందన్నారు. ఆస్పత్రిలో మెరుగైన వసతులు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు.ముందుగా వైద్యశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యుల నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ చారి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పోలీసుల తనిఖీలు

● పత్రాలు సరిగాలేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం



తురకపాలెంలో కార్డెన్ సెర్చ్‌పై సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌ఐ అమీనుద్దీన్

దాచేపల్లి, మే 21: మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన మాదినపాడులో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వేకువజామునే పోలీసులు గ్రామానికి చేరుకొని అనుమానాస్పద వ్యక్తుల గృహాలు, పశువుల పాకలు, ఎరువు దిబ్బలు, ఇతర పాడుబడిన గృహాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో గ్రామంలో టీడీపీ, వైసీపీ ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడం, కొంతమంది వ్యక్తులు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరి చికిత్సలు పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామంలో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనన్న ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఆయా పరిస్థితులను అంచనా వేస్తున్న పోలీసు అధికారులు ఆకస్మికంగా వేకువ జామునే గ్రామానికి చేరుకోవడం, గాలింపు చర్యలు జరుపడం ఆయా వర్గాల వ్యక్తులకు ఆందోళన కలిగించింది. కాగా గ్రామంలో ఎటువంటి పేలుడు సామగ్రిగాని, మారణాయుధాలు గాని లభించలేదని దాచేపల్లి ఎస్‌ఐ సంధ్యారాణి స్పష్టం చేశారు.

తురకపాలెంలో కార్డెన్ సెర్చ్.. 4 బైక్‌లు స్వాధీనం

మాచవరం, మే 21: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాచవరం మండలంలోని తురకపాలెంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి మాచవరం ఎస్‌ఐ అమీనుద్దీన్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామునే సుమారు 30మంది సిబ్బందితో గ్రామంలోకి వెళ్లి అక్కడ సిబ్బందికి సూచనలు ఇచ్చిన తరువాత ముగ్గురు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని ప్రతి ఇంటిని సెర్చ్ చేశారు. పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అమీనుద్దీన్ తెలిపారు. కౌంటింగ్ అయిపోయేంత వరకు ప్రతి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

జానపాడులో ఇంటింటి సోదాలు

పిడుగురాళ్ల, మే 21: సాదారణ ఎన్నికల అనంతరం పోలీసులు ఇంటింటి సోదాల కార్యక్రమం మంగళవారం జానపాడు గ్రామంలో నిర్వహించారు. గ్రామం అంతటా జల్లెడ పట్టిన పోలీసులు అనుమానిత ప్రాంతాల్లోనూ సోదాలు చేపట్టారు. అనుమానిత ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెంబరు ప్లేట్లు సరిగా లేకపోవడం, పత్రాలు లేనటువంటి వాహనాలను 25 గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

● దుర్గి, మే 21: మండలంలోని ఓబులేశునిపల్లెలో మంగళవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్‌ఐ కోటయ్య నేతృత్వంలో 40 మంది పోలీసులు గృహాలు, శిథిలావస్థకు చేరిన నివాసాలు, గడ్డివాములు పరిశీలించారు. రికార్డులేని 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

మారణాయుధాలు కలిగిఉన్న వారిపై కఠిన చర్యలు

ముప్పాళ్ళ మే 21: ఎన్నికల అనంతరం గ్రామాల్లో అల్లర్లను సృష్టించేందుకు మారణాయుధాలను గృహాల్లో దాచిపెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డీఎస్పీ గురునాధబాబు అన్నారు. మండలంలోని తొండపిలో రెండు రోజులుగా ముప్పాళ్ళ ఎస్‌ఐ హజరతయ్య గ్రామంలో ఇంటింటిని తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మంగళవారం రాత్రి తొండపిని పరిశీలించి అక్కడ గ్రామస్థులతో మాట్లాడారు. ఎన్నికలు 5 సంవత్సరాలకు ఒకసారి వస్తుంటాయి, పోతుంటాయి గ్రామంలో మీరంతా ఐక్యమత్యంగా కలిసిమెలసి ఉండాలని సూచించారు. గ్రామంలో శాంతి నెలకొల్పేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

వేల్పూరులో ప్రజలకు అవగాహన

అచ్చంపేట, మే 21 : మండలంలోని వేల్పూరు గ్రామంలోని ప్రజలకు సత్తెనపల్లి డీఎస్పీ జీ గురునాథబాబు గ్రామాల్లో గొడవలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ రోజు అనంతరం ఎలాంటి గొడవలు జరగకుండా ఉండాలని గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు చేపడతామని డీఎస్పీ గురునాథబాబు హెచ్చరించారు. ఆయనతో పాటు అచ్చంపేట ఎస్‌హెచ్‌వో కరీముల్లా షావలి, క్రోసూరు ఎస్‌హెచ్‌వో షేక్ రఫీ పాల్గొన్నారు.



ఓబులేశునిపల్లెలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు



తొండపిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ గురునాథబాబు

వైశాఖ పౌర్ణమితో నరసింహస్వామి కల్యాణం

దాచేపల్లి, మే 21: ఆంధ్రా తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం వైశాఖ పౌర్ణమితో బుధవారం రాత్రి జరుగనున్నది. మంగళవారం ఆలయంలో అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. దేవాలయం చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు విజయకుమార్, ఆలయ ఈవో ప్రవీణ్‌లు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అంకురార్పణ, ధ్వజారోహణం చేపట్టారు. ఆలయంలో వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. సుమారు 5వేల మందికి పైగా భక్తులు ఆలయానికి చేరుకోవచ్చునని అంచనా. ఇప్పటికే దేవదాయశాఖ, సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు అన్నదాన కార్యక్రమాలు, మంచినీరు, మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.



మట్టపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, స్వామి వారి మూలవిరాట్

ఘనంగా వార్షికోత్సవ పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్కంఠ వీరభద్ర స్వామి, కార్యసిద్ధి వినాయకస్వామి

నకరికల్లు, మే 21 : మండలంలోని కుంకలగుంటలో ఉన్న భద్ర కాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయంలో ఆలయ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, చండీ హోమం, రుద్రహోమం చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు స్వామి వారిని దర్శించుకొని అభిషేకాది పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను అర్చకులు యడ్లపల్లి ప్రవీణ్‌కుమార్ శర్మ, హనుమంతరావు, కోట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ కందిమళ్ళ చంద్రశేఖరరావు, పద్మావతి దంపతులు, రాయల హనుమంతరావు, విజయలక్ష్మి దంపతులు, జమ్ముల వెంకటేశ్వర్లు, అర్వపల్లి కుసుమ, నలమోతు చిన్నారావు, సుమతి దంపతులు, వెంకటరావు దంపతులు పాల్గొన్నారు. కార్యసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను అర్చక స్వామి కారంపూడి రాఘవాచార్యులు నిర్వహించారు.

వ్యవసాయశాఖ ఉద్యోగి లక్ష్మారెడ్డి హఠాన్మరణం

రెంటచింతల, మే 21: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖలో పనిచేసిన గొట్టం లక్ష్మారెడ్డి(47) మంగళవారం వేకువ జామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 2002 నుంచి ఆ శాఖలో ఎంపీఈవోగా పనిచేస్తూ రైతన్నల మన్ననలను పొందారు. ఆ తరువాత సచివాలయంలో వీఏఏ(విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్) బాధ్యతలను చేపట్టి రెంటాల గ్రామంలో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య నీలిమ ఇద్దరు సంతానం. ఆయన స్వగ్రామం మిట్టగుడిపాడు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు ఇస్మాయిల్ మృతి

దాచేపల్లి, మే 21: ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన విశ్రాంత ఉపాధ్యాయుడు వేల్పుల ఇస్మాయిల్ (83) మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీలోని నారాయణపురంలో తుదిశ్వాస విడిచారు. ఇస్మాయిల్ మాస్టార్ దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో సుదీర్ఘ కాలం పనిచేశారు. వయోభారంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా 10 రోజుల క్రితమే ఆయన పెద్దకుమారుడు కూడా అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. 15 రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబంలో తండ్రీ కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం తీరని శోకంలో మునిగిపోయింది. ఇస్మాయిల్ మరణవార్త తెలుసుకున్న దాచేపల్లి మండల పెన్షనర్స్ అసోసియేషన్ సంఘసభ్యులు సంతాపాన్ని తెలిపారు. అతడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యం దుకాణంపై దాడి

● రూ.51,470 నగదు, 37 క్వార్టర్ల మద్యం స్వాధీనం

రెంటచింతల, మే 21: మండలంలోని మంచికల్లు గ్రామంలో మద్యం దుకాణం (బెల్టుషాపు)పై సోమవారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ ఎం ఆంజనేయులు నేతృత్వంలో దాడి చేశారు. దీంతో సంబంధిత వ్యక్తి డబ్బుల వదిలి పరారయ్యాడు. నగదు 51,470 రూపాయలు, 37 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

కుక్క కాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలు



కుక్కకాటుకు గాయపడిన శివజ్యోతి

సత్తెనపల్లి మే 21: కుక్క కరిచి ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన అచ్చంపేట మండలం గందసిరిలో మంగళవారం జరిగింది. కుక్క కాటుకు గురైన వారిలో కె.అప్పమ్మ, ఆదితేజ, శివజ్యోతి, సీహెచ్ పవన్, మరో యువకుడు ఉన్నారు. వీరంతా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అదేవిధంగా బెల్లంకొండకు చెందిన ఇస్మాయేల్ కూడా కుక్కకాటుకు గురై సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.



తంగెడ రహదారి దుస్థితి

ఈ రహదారిపై నడక నరకయాతన

● రెండు రాష్ట్రాల రహదారి అధ్వానం

పిడుగురాళ్ల, మే 21: దాచేపల్లి నుంచి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లే రహదారిపై నడక నరకంగా మారింది. కొన్నేళ్లుగా ఈ రహదారికి తాత్కాలిక మరమ్మతులే తప్ప శాశ్వతంగా రోడ్డు వేసిన పాపాన పోకపోవడంతో ఈ రహదారిపై వాహనాల ప్రయాణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సాగించాల్సిందే.. తంగెడ గ్రామంలో మోకాళ్లలోతు గుంతలతో ఉన్న రహదారి చూస్తే వామ్మో ఇది రహదారేనా అంటూ వాహనదారులు భయపడిపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంత లోతు ఎంతో తెలియక వాహనదారులు మరీ ఇబ్బంది పడుతున్నారు.

తిరుపతి వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భాష్యం ప్రవీణ్



తిరుపతిలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భాష్యం ప్రవీణ్, సతీమణి లావణ్య, సోదరుడు నవీన్ తదితరులు

పెదకూరపాడు, మే 21: పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్యలు తిరుపతిలో వెంకటేశ్వర స్వామిని దర్శించారు. మంగళవారం ఉదయం స్వామి వారిని కుటుంబసమేతంగా దర్శించుకొని వేద పండితుల ఆశీర్వచనాలను అందుకున్నారు. అనంతరం కాళహస్తిలో దేవుణ్ని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జూన్ 4న రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమికి విజయం చేకూరాలని కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వర స్వామిని కోరుకున్నాట్లు తెలిపారు. వారి వెంట ప్రవీణ్ సోదరుడు నవీన్, శివ, వాసిరెడ్డి అనీల్, వారి బంధువులు ఉన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● జేసీ శ్యాం ప్రసాద్



నరసరావుపేట, మే 21: జిల్లాలో 24 నుంచి 3వరకు జరగనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం 10వ తరగతి పరీక్షల నిర్వహణపై ఆయన సమీక్షించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగింది. సుమారుగా 6199మంది ప్రైవేటు, రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. పరీక్ష ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద నిరంతరం విద్యుత్ ఉండేలా చూడాలని తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు 10వ తరగతిలో 938మంది, ఇంటర్మీడియట్‌కు 1272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు అన్నారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు ఉంటుందన్నారు.విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా పరీక్షా కేంద్రాలకు వెళ్లే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఊరేగింపులు బహిరంగ సభల వల్ల విద్యార్థిని విద్యార్థులకు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల అనంతరం పరీక్ష పత్రాలను పకడ్బందీగా సంబంధిత కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు వద్ద 144 సెక్షన్ అమలు అయ్యేలా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి 9963192487 నంబర్‌కు కాల్ చేసి పరిష్కారం పొందవలసిందిగా ఆయన సూచించారు.

రాజీవ్‌గాంధీకి నివాళులు



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు

సత్తెనపల్లి, మే 21: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, మాదంశెట్టి వేదాద్రి, సిద్దెల మోహనరావు, కోట ఆనంద్, ఎం శంకర్, చాంద్ బాషా, అబ్రహం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత లక్ష్యానికి తూట్లు

● తుప్పు పడుతున్న బ్యాటరీ ఆటోలు



పురపాలక సంఘం వద్ద నిలిచి ఉన్న ఆటోలు

సత్తెనపల్లి, మే 21 : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ పేరుతో అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసి చెత్త తరలింపునకు బ్యాటరీ ఆటోలు, రిక్షాలు మంజూరు చేశారు. చెత్త సంపద కేంద్రాల నిర్వాహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. అదేవిధంగా పురపాలక సంఘానికి కూడా బ్యాటరీతో నడిచే తొమ్మిది ఆటోలను అందించారు. వీటిలో ఐదు ఆటోలు మరమ్మతులకు గురై వివిధ సాంకేతిక కారణాలతో పురపాలక సంఘ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్నాయి. ఈ ఆటోలను వినియోగంలోకి తెస్తే పురపాలక సంఘానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆటోలకు మరమ్మతులు చేయాల్సి ఉంటుందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



రెవెన్యూ, పోలీసు అధికారులతో సమీక్షచేస్తున్న ఎన్నికల అధికారి సుబ్బారావు

కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

● ఆర్వో సుబ్బారావు

వినుకొండ, మే 21: జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో అల్లర్లు జరకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్వో సుబ్బారావు ఆదేశించారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో మండల తహసీల్దార్ పోలీసు అధికారులతో కలిసి శాంతి భద్రతలపై ఆర్వో సుబ్బారావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో చర్చించి, ప్రజలకు శాంతియుత వాతావరణం కల్పించాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

సేంద్రియ సాగుపై అవగాహన పెంపొందించుకోవాలి

● డాక్టర్ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, మే 21: విద్యార్థి దశలో విద్యతో పాటు ప్రతి విద్యార్థి స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. రావిపాడుతో మంగళవారం నిర్వహించిన గ్రామీణ పని అనుభవం పేరుతో వ్యవసాయి కళాశాల విద్యార్థులతో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో అయన మాట్లాడారు. వారం రోజుల పాట రావిపాడులో వివిధసేవా కార్యక్రమాలు విద్యార్థుల ద్వారా నిర్వహిస్తామన్నారు. వ్యవసాయి కళాశాల విద్యార్థులు రైతు సదస్సు కూడా నిర్వహించారు. వ్యవసాయంలో పెట్టుబడిని తగ్గించుకొని అధిక లాభాలు గడించే విధానాన్ని రైతులుకు తెలియజేశారు. ప్రొఫెసర్ డాక్టర్ ఓబయ్య ముట్లాడుతూ రైతులందరు భూసార పరీక్షల ప్రకారం ఎరువులు వాడుకోవాలని తెలియజేశారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసిన విత్తనం విత్తినట్లయితే ఖర్చు తగ్గడంతో దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే నర్సారావుపేట ఏడీఏ మస్తానమ్మ, డాక్టర్ జి. రమేష్, డాక్టర్ లత, డాక్టర్ జ్యోతి తదితరుల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి



మృతి చెందిన డాక్టర్ శ్రీకాంత్

హుజూర్‌నగర్, మే 21: తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని వేపలసింగారం గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వైద్యుడు మృతి చెందారు. ఏఎస్ఐ బలరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన దామరచర్ల శ్రీకాంత్‌బాబు (38) పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిస్తున్నాడు. సోమవారం రాత్రి మేళ్ళచెర్వులోని స్నేహితుడి పుట్టిన రోజు వేడుకకు హాజరై పల్సర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో గేదెలు రోడ్డుపైకి రావడంతో వాటిని తప్పించబోయి ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. ఈ ఘటనలో నుదుటి వద్ద తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి సోదరుడు వేణుబాబు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నాదెండ్ల, మే 21: మండలంలోని గణపవరం పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. చిలకలూరిపేట వడ్డెర కాలనీకి చెందిన ఉప్పు హనుమంతరావు, ఆయన కుమారుడు హేమంతకుమార్‌లు ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి చిలకలూరిపేట వస్తుండగా గణపవరం ప్రధాన జంక్షన్ వద్ద ఆటో వేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరిని చికిత్సకోసం చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. నాదెండ్ల ఎస్ఐ బాలరామిరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

ఘనంగా సాయిబాబా తిరునాళ్ల

వినుకొండటౌన్, మే 21: మండలంలోని చీకటీగలపాలెం సాయిబాబా తిరునాళ్ల కార్యక్రమాన్ని భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేకువ జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అస్తవ్యస్తంగా డ్రెయిన్లు... రోడ్లపై పారుతున్న మురుగు







అగ్నిగుండాలలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు, కొచ్చెర్ల ప్రధాన వీధిలో రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు

ఈపూరు, మే 21: అస్తవ్యస్త డ్రెయిన్లతో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని దుస్థితి ఈపూరు మండలంలోని గ్రామాలో నెలకొని ఉంది. ఆక్రమణల వలన, పూడిక తీయకపోవడం వలన డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో మురుగు నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. అసలే గ్రామాలలో అంతర్గతరోడ్లు గోతులతో అధ్వానంగా ఉండడంతో అవస్థలు పడుచున్న ప్రజలకు రోడ్లపై మురుగునీరు ప్రవహించడం, నిల్వ ఉండడంతో నరకం చవిచూస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉండడం వలన ఆప్రదేశంలో దుర్గంధం వెదజల్లుతుండడంతో వ్యాధులు సోకుతాయోనని భయాందోళన చెందుతున్నారు. మురుగు నిల్వ ఉండడం వలన దోమలు చేరి రాత్రి పగలు తేడా లేకుండా వాటి ప్రతాపం చూపిస్తున్నాయి. దోమలు నిర్మూలనకు కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై గోతులలో నీరునిలిచి కొద్దిపాటి తటాకాలను తలపిస్తున్నాయి. మండలంలో అగ్నిగుండాల, కొచ్చెర్ల, ఉప్పరపాలెం, ఈపూరు, కొండ్రముట్ల, అంగలూరు గ్రామాలలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. శివారు గ్రామాలైన యర్రబాలెం, యర్రగుంటతండా, కొచ్చెర్ల తండాలలో మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో అక్కడ భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి పారిశుధ్యం మెరుగుపరచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుచున్నారు.



ఆరేపల్లిలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

ఆరేపల్లిలో పారిశుధ్యం పై అధికారుల అలసత్వం

రొంపిచర్ల, మే 21: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో పారిశుధ్యంపై అధికారులు అలసత్వాన్ని పదర్శిస్తున్నారు. గత 15 రోజులుగా వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. సచివాలయ సిబ్బందికి తెలిపినా స్పందించటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. చెత్త వల్ల దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వైద్యశాఖ సిబ్బంది ఉన్నా వీటిపై అధికారులకు తెలిపిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా స్పందించి పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జేసీ శ్యాం ప్రసాద్



నరసరావుపేట, మే 21: జిల్లాలో 24 నుంచి 3వరకు జరగనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం 10వ తరగతి పరీక్షల నిర్వహణపై అయన సమీక్షించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగింది. సుమారుగా 6199మంది ప్రైవేటు, రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. పరీక్ష ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద నిరంతరం విద్యుత్ ఉండేలా చూడాలని తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు 10వ తరగతిలో 938మంది, ఇంటర్మీడియట్‌కు 1272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు అన్నారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు ఉంటుందన్నారు.విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా పరీక్షా కేంద్రాలకు వెళ్లే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఊరేగింపులు బహిరంగ సభల వల్ల విద్యార్థిని విద్యార్థులకు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల అనంతరం పరీక్ష పత్రాలను పకడ్బందీగా సంబంధిత కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు వద్ద 144 సెక్షన్ అమలు అయ్యేలా చూడాలన్నారు.

పరీక్షల నిర్వహణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి 9963192487 నంబర్‌కు కాల్ చేసి పరిష్కారం పొందవలసిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అరవిందబాబు నిరసన

టీడీపీ కార్యకర్తల అక్రమ అరెస్టులపై



నేలపై పడుకొని నిరసన తెలియజేస్తున్న డాక్టర్ అరవిందబాబు


నరసరావుపేట టౌన్, మే 21: తెలుగుదేశం కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తునందుకు నిరసనగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తన స్వగృహంలో నేలపై పడుకొని నిరసన తెలియజేశారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలో ప్రకాశ్‌నగర్‌లో హౌస్ అరెస్ట్‌లో ఉన్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు గృహం వద్ద మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నియోజవర్గ లీగల్ సెల్ కార్యదర్శి సీతారామాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ పెట్టిన అక్రమ కేసులలో నిందితులు దొరకకపోతే కార్యకర్తల గృహాలకు వెళ్ళి కుటుంబసభ్యులను టూ టౌన్ స్టేషన్‌కు తీసుకువెళ్ళి ఇబ్బంది పెడుతున్నారన్నారు. టీడీపీ వాళ్ళు ఇచ్చిన ఏ ఫిర్యాదులు తీసుకోకుండా, వైసీపీ కార్యకర్తలను ఒక్కళ్ళను కూడా అరెస్టు చేయకుండా, టీడీపీ వాళ్ళను ఇప్పటికే పదిమందిని అరెస్టు చేశారన్నారు. ఇంకా అరెస్టులను కొనసాగిస్తున్నారని, రేపు కౌటింగ్‌కు ఏజెంట్‌లు లేకుండా చేయాలనే దుర్బుద్దేశ్యంతో పోలీసులు ఎమ్మెల్యే జేబులో ఉన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దానికి నిరసనగా తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నారని డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఇంటిలో నేలపై పడుకుని నిరసన తెలియజేస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ లీగల్ సెల్ నియోజవర్గ ఉపాధ్యక్షుడు సురేష్ బాబు, షేక్ ఖాశీమ్ తదితరులు పాల్గొన్నారు.



రంగనాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పార్టీ నాయకులు

ఘనంగా రంగనాయస్వామి తిరునాళ్ల

వినుకొండ మే 21: మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామ సమీపంలోని రంగనాయకస్వామి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమాన్ని భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు, వేకువజాము నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవాలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి, స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా మాజీ శాసనసభ్యుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు మక్కెన మల్లికార్జునరావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం దేవాలయ అర్చకులు సాయి కృష్ణ, మక్కెనకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవదాయశాఖ ఈవో వెంకటరెడ్డి మక్కెన మల్లికార్జునరావును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, భక్తులు, తిమ్మాయిపాలెం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కొల్లి నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతు ఉద్యమనేత కొల్లి నాగేశ్వరావుకు ఘన నివాళి

వినుకొండ, మే 21: రైతు ఉద్యమనేత కొల్లి నాగేశ్వరరావు నాల్గో వర్ధంతిని స్థానిక శివయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ముందుగా నాగేశ్వరరావు చిత్రపటానికి పలువురు నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా రైతు సంఘం నాయకులు ఉలవులపూడి రాము మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు అహర్నిశలు రైతు సంక్షేమం కోసం పనిచేశాడని కొనియాడారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున, నరసింహరావు, పి.వెంకటేశ్వర్లు, రంగబాబు, దావీదు, మస్తాన్ సుబేదార్, తదితరులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకర్‌రావు

వ్యక్తిగత కారణాలతోనే రామకృష్ణపై దాడి

● వినుకొండ రూరల్ సీఐ సుధాకర్‌రావు

శావల్యాపురం, మే 21: మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో మండవ రామకృష్ణపై సోమవారం రాత్రి జరిగిన దాడి వ్యక్తిగత కారణాలతో జరిగిందే తప్ప దానిలో ఎటువంటి రాజకీయ వివాదాలకు తావులేదని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు వెల్లడించారు. దాడి సంఘటన నేపథ్యంలో కృష్ణాపురం గ్రామాన్ని రూరల్ సీఐ సిబ్బందితో కలసి మంగళవారం సందర్శించి విచారణ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణాపురం గ్రామానికి చెందిన మండవ రామకృష్ణ, నాసరమ్మ కుటుంబాల మధ్య చాలా రోజులుగా వివాదం ఉందని, నాసరమ్మ ఇంటి ముందు నిలబడి ఉన్న తనపై నాసరమ్మ కుటుంబసభ్యులు దాడిచేశారని రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో రామకృష్ణపై తన కుటుంబానికి చెందిన బాలిక క్రికెట్ బ్యాటుతో దాడిచేసినట్లు నాసరమ్మ వెల్లడించిందని తెలిపారు. నాసరమ్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బాధితుడు రామకృష్ణతోపైన, రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాసరమ్మ, రిజ్వానా, బికారి, నాగూర్ మీరావలి, మీరాబాబు, నాగూర్‌లపై క్రిమినల్ కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు చల్లా సురేష్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్



రామిరెడ్డిపాలెంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రొంపిచర్ల, మే 21: మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం రామిరెడ్డి పాలెంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో ఎన్నికల సందర్భంలో ఇక్కడ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సమీపిస్తున్న వేళ గ్రామాల్లో అనుమానాస్పద ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర, బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.



కారుమంచిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● వినుకొండ రూరల్ సీఐ సుధాకర్‌రావు

కారుమంచి (శావల్యాపురం) మే 21: గ్రామాలలోని ప్రజలంతా రాజకీయ వివాదాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా లేనిపోని గొడవలకు తెరదీసి శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే వారిపై కఠినచర్యలు తప్పవని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం పల్నాడు జిల్లాలో చెలరేగిన రాజకీయ అల్లర్ల దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని కారుమంచి గ్రామంలో రూరల్ సీఐ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలించి నాటుబాంబులు, మారణాయుధాల నిల్వలను తనిఖీ చేశారు. ఆధారాలు, పత్రాలు లేని ఆరు ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసినందున ప్రజలు రాజకీయ వివాదాలకు దూరంగా ఉండాలని, అన్నదమ్ముల్లా కలసిమెలసి జీవించాలని, ఏవైనా సమస్యలుంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎస్ఐలు సురేష్, చెన్నకేశవులు, లక్ష్మీనారాయణరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు, మే 21: అల్లర్లకు పాల్పడిన, ప్రేరేపించిన వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ ఎస్కే మహమ్మద్ ఫిరోజ్ అన్నారు. మండలంలోని కూచినపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని, దిబ్బలను, చావిడిలను క్షుణ్ణంగా తనిఖీచేశారు.

నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో భద్రపరిచిన 357 పోస్టల్ బ్యాలెట్లు



నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో పోస్టల్ బ్యాలెట్లను పరిశీలిస్తున్న అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

చిలకలూరిపేట, మే 21: చిలకలూరిపేట నియోజకవర్గంలో ఓట్లు ఉండి ఇతర ప్రాంతాల్లో పోలింగ్ విధులు నిర్వహించిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లను మంగళవారం రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా వేర్వేరుచేశారు. మొత్తం 357 కవర్లు ఇలా వేర్వేరుగా ఉన్నట్టు గుర్తించారు. ఈ నెల 11వ తేదీన ఈ కవర్లన్నింటినీ సీలువేసిన బాక్సుల్లో రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి నాదెండ్ల పోలీసు స్టేషన్ వద్దకు తీసుకువచ్చారు. పోలీసు స్టేషన్‌లో వాటిని వేర్వేరుచేసి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గపు బాక్సుల్లో ఉంచి సీలు వేశారు. మధ్యాహ్నం సమయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ బ్యాలెట్ బాక్సులను చిలకలూరిపేటలో ఉన్న ట్రెజరీ కార్యాలయానికి తరలించేందుకు సిద్ధమయ్యారు. ఐతే అనంతరం వచ్చిన ఆదేశాల మేరకు నాదెండ్ల పోలీసు స్టేషన్‌లోనే వాటిని ఉంచటానికి నిర్ణయించారు. కాగా పోస్టల్ బ్యాలెట్లు ఉన్న ఈ బాక్సుల భద్రతకు పోలీసుస్టేషన్ వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

చిలకలూరిపేట, మే 21: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ప్రసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ హయాంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాన్ని భారీఎత్తున అభివృద్ధి చేయటానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆయన హయాంలో యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించటానికి ఇటలీ నుంచి శ్యామ్‌పిట్రోడా అనే నిపుణుడిని రప్పించి ఆరంగాన్ని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ బి.రామకోటేశ్వరరావు, నటరాజ వెంకటేష్ తేవర్, మద్దాలి శ్రీనివాసరావు, భవానీ వెంకటేష్ షేక్ బాషా, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు